క్లుప్తంగా

8న శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ : తీర్థయాత్ర స్పెషల్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 8న శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 8న ఉదయం మదనపల్లె నుంచి బయలుదేరి కడప, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం చూసుకుని శ్రీశైలంలో రాత్రి బస చేయడం జరుగుతుందన్నారు. 9న ఉదయం మహానంది, యాగంటి, అహోబిలం చూసుకుని మదనపల్లెకు చేరుతుందన్నారు. రాను, పోను చార్జీలు రూ.2000 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9441646104, 9440249483ని సంప్రదించాలని కోరారు.

అనాథాశ్రమానికి రూ.10వేలు వితరణ


చెక్కును అందజేస్తున్న డాక్టర్ కవిత

మదనపల్లె సిటీ : మదనపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ కవిత శనివారం స్థానిక బసినికొండవద్దనున్న కూరపర్తి అనాథాశ్రమానికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. చెక్కును నిర్వాహకులు పద్మనాభరెడ్డికి అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది అనాథ ఆశ్రమానికి తనవంతు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సాయి డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం అధికారిగా ఎస్.మస్తాన్



పీలేరు రూరల్ : పీలేరు అగ్నిమాపక కేంద్రం అధికారిగా ఎస్. మస్తాన్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ అగ్నిమాపక అధికారిగా ఉన్న సుబ్బరాజ్ బదిలీపై తిరుపతి జిల్లా నగిరికి వెళ్లారు. నగిరిలో పని చేస్తున్న మస్తాన్ పీలేరుకు వచ్చారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలపై తక్షణం స్పందించేలా అందుబాటులో ఉంటామని తెలిపారు.

క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ ఉదయ్‌కిరణ్, డాక్టర్ పావని

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. శనివారం డాక్టర్ ఉదయ్‌కిరణ్, డాక్టర్ పావని బాధితులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సైకిల్ తొక్కండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో రేఖానాయక్, పీహెచ్ఎన్ రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు


గాయపడిన రఫీ

పీలేరు రూరల్ : తుపాన్ వాహనం, ఆటో ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డ సంఘటన శనివారం రాత్రి పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. పీలేరు పట్టణం యర్రమరెడ్డిగుట్టకు చెందిన రఫీ (35) ఆటోలో కడప రోడ్డు మార్గం నుంచి వచ్చే సమయంలో కాణిపాకం నుంచి వేంపల్లెకు వెళుతున్న తుపాన్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో రఫీ తీవ్రంగా గాయపడ్డాడు. తుపాన్ వాహనం డ్రైవర్ భాస్కర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రఫీని చికిత్సనిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటిని సద్వినియోగం చేసుకోండి

కలికిరి: ఆర్వో ప్లాంటు ద్వారా అందించే ఉచిత తాగునీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ అన్నారు. కలికిరి పట్టణ పరిధిలోని కొత్తపేట వీధిలో మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటును వారు ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ ఆరోగ్యంగా ఉండటానికి శుద్ధి చేసిన నీరు ఎంతో అవసరమని గుర్తించి పట్టణంలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడీ హరి, కలికిరి వైస్ సర్పంచ్ నూరిన్నిషా, స్థానికులు పాల్గొన్నారు.

యాదాళం.. ఔదార్యం


యాదాళం పేరుతో నడుస్తున్న జెడ్పీ హైస్కూల్ (ఫైల్)



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- స్వగ్రామానికి చేయూతనిస్తున్న యాదాళం సుబ్బయ్య శెట్టి వంశీకులు
- విద్యాలయాలు, ఆసుపత్రికి భూమితో పాటు రూ.లక్షల నగదు విరాళం
- ప్రతి ఏడాది ఉచిత కంటి వైద్య శిబిరం


యాదాళం సుబ్బయ్య శెట్టి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరుకు చెందిన యాదాళం సుబ్బయ్య శెట్టి భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన వంశీకులు మాత్రం ఆయన పేరు చిరస్థాయిగా వుండేలా పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. యాదాళం వంశీకులు వ్యాపార రీత్యా 45 ఏళ్ల క్రితమే బెంగళూరులో స్థిరపడినా స్వగ్రామంపై మమకారంతో విద్యాలయాలకు, ప్రభుత్వాసుపత్రులకు ఏదో రూపంలో సహాయ సహకారాలు అందిస్తూనే ఉన్నారు. స్థానికంగా ప్రభుత్వాసుపత్రి నిర్మాణం కోసం అవసరమయ్యే రెండెకరాల స్థలాన్ని 20 ఏళ్ల క్రితమే ఉచితంగా ఇచ్చారు. అంతే గాక ఆసుపత్రి అభివృద్ధి కోసం అప్పట్లోనే రూ.2 లక్షల నగదును విరాళంగా అందజేశారు. స్థానికంగా ఉండే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 3.74 ఎకరాల స్థలాన్ని కూడా ఉచితంగా ఇచ్చారు. చదువులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రతి యేటా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. పాఠశాలకు గతంలో రూ.3.24 లక్షల విలువ చేసే డెస్కులు, టేబుళ్లు, కుర్చీలు అందజేశారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం కోసం రూ.5 లక్షలు వెచ్చించి నూతనంగా బోరును వేయించి అందులో మోటారు, పైపులు అమర్చి తాగునీటి సౌకర్యం కల్పించారు. హైస్కూల్‌లో మరుగు దొడ్ల నిర్మాణం కోసం కూడా గతంలో కొంత నగదును సాయంగా అందజేశారు. దీంతో జెడ్పీ హైస్కూల్‌కు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి యాదాళం సుబ్బయ్య శెట్టి పేరును నామకరణంగా పెట్టారు. పాఠశాల విద్యార్థులకే గాక అంధత్వ లోపం ఉన్న వారికి ప్రతి యేటా ఉచితంగా హైస్కూల్లోనే కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బెంగళూరులో ఉచితంగా ఆపరేషన్లు చేయించి ఆదర్శంగా నిలిచారు. యాదాళం సుబ్బయ్య శెట్టి మనవళ్ళు బాలచందర్, రాంకుమార్‌లు ప్రతి యేటా స్వగ్రామానికి వచ్చి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అంతేగాక ప్రతి ఏటా గ్రామంలో జరిగే ఆలయాల నిర్మాణం, రథోత్సవాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు.

రైలు ప్రమాద బాధితుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు


మాట్లాడుతున్న ఆర్డీవో మురళి

మదనపల్లె : ఒరిస్సా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాద ఘటనలో బాధితుల కోసం మదనపల్లె డివిజన్ కేంద్రంలో కంట్రోల్ రూము ఏర్పాట చేసినట్లు ఆర్డీవో ఎం.ఎస్.మురళి తెలిపారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఆగి ఉన్న గూడ్స్ రైలును కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనగా, ఇదే ఘటనలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌ను హౌరా ఎక్స్‌ప్రెస్ ఢీకొని దిగ్భ్రాంతి కరమైన రైలు ప్రమాదం చోటుచేసుకుంది. 250 మందిపైగా ప్రమాదంలో మృతి చెందడం, 900 మందికిపైగా గాయపడటంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కోరమండల్, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లా వాసులు ప్రయాణించే అవకాశం ఉందన్నారు. రైలు ప్రమాద ఘటనలో ఎవరైనా మదనపల్లె డివిజన్ వాసులు కోరమండల్, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో ప్రయాణించినట్లయితే వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, పరిచయస్తులు, ప్రయాణ వివరాలను కంట్రోల్‌రూముకు తెలియజేయాలన్నారు. ప్రమాదంలో గాయపడిన మృతి చెందిన వెంటనే వారికి తగిన సహాయ సహకారాలు ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ మండల కేంద్రాల్లోను, డివిజన్ కేంద్రంలోనూ ప్రమాద బాధితుల కోసం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సంబంధిత తహసీల్దార్లతో ఇప్పటికే సమీక్షా నిర్వహించినట్లు చెప్పారు. ప్రయాణికుల వివరాలను నిర్ధారించాలని, పూర్తి సమాచారంతో నివేదికలు అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రయాణికుల సమాచారాన్ని ఇతర వివరాలు మదనపల్లె డివిజన్ కేంద్రం కంట్రోల్ రూము ఫోన్ నంబర్లు 9491077010, 8978829713ను సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌లైన్

గుర్రంకొండ : ఒరిస్సా రైలు ప్రమాద బాధితుల వివరాల కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ ప్రారంభించినట్లు తహసీల్దార్ ఖాజాబీ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ఏగ్రామానికి చెందిన వారైనా ఒరిస్సా రైలు ప్రమాద బాధితులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే సమాచారమిస్తే స్పందించి తగు చర్యలు చేపడతామన్నారు. హెల్ప్‌లైన్ కేంద్రంలో 8247547477 సెల్‌నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించవచ్చన్నారు.

పెద్దతిప్పసముద్రం : ఒడిస్సాలో శుక్రవారం రాత్రి జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద దుర్ఘటనపై ఏపీకి చెందిన వారు కూడా సుమారు 120 మంది దాకా ప్రజలు ప్రయాణిసున్నట్లు సమాచారం . దీంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై ఉంటే తక్షణం ఆ గ్రామ వీఆర్వోకు సమాచారం అందజేస్తే సహాయ సహకారాలు అందిస్తామని తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట


ప్రత్యేకాలంకరణలో కన్యకాపరమేశ్వరి

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శనివారం స్థానిక ఆలయంలోవేకువ జామునే యంత్రప్రతిష్ట, శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టను వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయంలోనే శ్రీ గణపతి, సుబ్రమణ్యస్వామి, అభయాంజినేయస్వామి, నవగ్రహల విగ్రహల ప్రతిష్ట కావించారు. ఈసందర్భంగా వేదపండితులు అమ్మవారి మూల మంత్ర హోమం, దుర్గాసూక్త హోమం, దేవిసూక్త హోమం, శ్రీసూక్త, కళాహోమం నిర్వహించారు. మధ్యాహ్నం స్థానిక శ్రీవాసవీ మహిళా సంఘసభ్యులచే 108 మంది మహిళలకు వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. సాయంకాలం గణపతి పూజ, కృష్ణయుజుర్వేద పారాయణం, చండీపారాయణంతో కుంకుమార్చన చేశారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేష్, నగేష్,వెంకటాచలపతి, నరసింహులు, శ్రీనివాసకన్నన్, మల్లికార్జున, పండరీనాథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

మదనపల్లె సిటీ : ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి వసంత అన్నారు. శనివారం స్థానిక సిటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కరాటే మాస్టర్ సురేష్ కరాటే నేర్చుకోవడంలో ఉన్న ఉపయోగాలు వివరించారు. గోల్డ్‌మెడలిస్టు షేక్ మిస్బా కరాటే విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో టు టౌన్ హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

కలకడ : మండలంలో 20 లీటర్లు సారా సీజ్‌చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ అర్పింటిదిన్నె క్రాస్ వద్ద సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. సారా విక్రయించడానికి సిద్ధంగా ఉన్న సంబేపల్లె మండలం పెద్దబిడికి గ్రామానికి చెందిన అన్నానాయక్, యశ్వంత్‌నాయక్‌ల వద్ద నుంచి 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. దాడులలో పోలీసులు రమేష్, యోగేష్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి ధ్యానం

రాయచోటిటౌన్ : రాయచోటిలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో పౌర్ణమి ధ్యానం నిర్వహించనున్నట్లు రాచవీడు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5–30 గంటల నుంచి రాత్రి 8–30 గంటల వరకు తిరిగి రాత్రి 9 గంటల నుంచి 12–30 గంటల వరకు ధ్యానం ఉంటుందన్నారు.

శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసిన మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో..

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ అడవికమ్మపల్లెలో కొలువైన శ్రీనివాసుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు.

నేడు అవధూత నారాయణ స్వామి ఆరాధనోత్సవాలు

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో వెలసిన అవధూత నారాయణస్వామి 74వ ఆరాధనోత్సవాలను ఆదివారం ఉదయం 6.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సీతారాంరెడ్డి శనివారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 12.40 నిమిషాలకు అభిషేకం, 1.20 నిమిషాలకు మహా మంగళ హారతి, తీర్థప్రసాదం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి 9గంటలకు సత్యసాయి జిల్లా కదిరికి చెందిన శ్రీ లక్ష్మీవెంకటేశ్వర కళాబృందంచే సాసవుల చిన్నమ్మ కథను నాట్య రూపంలో ప్రదర్శిస్తారన్నారు. అలాగే బండలాగుడు పోటీలు కూడా నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత

రాయచోటి అర్బన్ : వాతావరణ కాలుష్య నివారణ అందరి బాధ్యత అని కళాజాత కళాకారులు తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. వీధినాటికలు, మేజిక్, హాస్య సన్నివేశాలు, ఆట పాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన ప్రజలు తమకు తెలియ కుండానే కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నారని వివరించారు.

వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి


రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అరుణమ్మ

వాల్మీకిపురం : రైతులు ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరుణమ్మ అన్నారు. శనివారం మండలంలోని గండబోయనపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు వేరుశనగ విత్తనాలు కొరత లేకుండా రైతుల అవసరం మేరకు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. సాగుకు అనువుగా ఉండే వేరుశనగ విత్తన కాయల పంపిణీలో కె6, నారాయణి రకం రకాలను పంపిణీ చేసిందన్నారు. ప్రభుత్వం రైతులకు వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ హేమలత, సర్పంచ్ గుర్రప్ప, నాయకులు సంజీవ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శీనా, ప్రసాద్ రెడ్డి, సద్దాం, మౌలాలి, నవాజ్, ఉత్తన, రాజారెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ : ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న వేరుశనగ విత్తనకాయల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండలప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల బస్తాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 13 ఆర్బీకేలకు కేసిక్స్ రకం కాయలు 826 క్వింటాళ్లు, నారాయణ రకం కాయలు 385 క్వింటాళ్లు సరఫరా చేశామన్నారు. కె6 రకం కాయలు బస్తా ధర రూ.1674 కాగా నారాయణ రకం కాయల బస్తా ధర రూ. 1773 గా నిర్ణయించారన్నారు. అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రత్నమ్మ, పీఆర్ ఎఈ జావీద్, ఎంపీటీసీ ఖదరీ, వీహెచ్ఎలు నవాజ్, శిరిష, రైతులు పాల్గొన్నారు.

కలికిరి : ప్రభుత్వం రైతులకు రాయితీతో అందచేస్తున్న వేరుశనగ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం కలికిరి–4 రైతు భరోసా కేంద్రంలో విత్తన కాయలు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజన్ కంటే ముందుగానే రైతులకు అనుకూలంగా అందచేయడం జరుగుతోందన్నారు. గుట్టపాళెం రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ వెంకటరెడ్డి రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఎఓ మమతారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, కార్యదర్శి గోపి, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పాలనే ప్రభుత్వ లక్ష్యం


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : అభివృద్ధి, సంక్షేమ పాలనే మా ప్రభుత్వ లక్ష్యం అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రాంనగర్‌కాలనీ, సీపీ మహల్ కాలనీ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, ఆయా కుటుంబాలకు చేరిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందుకుంటున్నారన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా పని చేయాలని, ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించే విధంగా పని చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో స్వర్ణయుగం నడుస్తోందన్నారు. టీడీపీ పాలనలో పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్ల రిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ముడుపులు చెల్లిస్తేనే కానీ ప్రభుత్వ పథకాలు అందని దుస్థితి ఉండేదన్నారు. సీఎం జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావులేకుండా వలంటీర్లు తలుపుతట్టి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారన్నారు. అధికారం చేపట్టగానే 98.5శాతం హామీలు అమలు చేయడంతో సీఎం జగన్ పాలన ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. గత నాలుగేళ్లలో నవరత్నాలు ద్వారా ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూర్చి కరోనా లాంటి విపత్తులు వచ్చిన ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం సీపీ మహల్ దగ్గర ఉన్న మసీద్‌లో మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే చింతలను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఈవో ఉదయ్ కుమార్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, అబ్దుల్ కలీమ్, శ్రీధర్‌రాయల్, రఘు, రవి, సైపుల్లా, రాయుడు, మహబూబ్‌బాషా, షాహెద్, సాధిక్, శ్రీనివాసులు శెట్టి, చికెన్‌మస్తాన్, ఖాదరీ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కండంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరురూరల్ : సైకిల్ తొక్కండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల కాలుష్యం తగ్గించుకోవడం తోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. సైకిల్ తొక్కడం వల్ల అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్, పక్షవాతం, క్యాన్సర్, గుండెజబ్బులు, థైరాయిడ్ నుంచి కాపాడుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో శాశ్వత భూహక్కు పత్రాలు


గుర్రంకొండలో డ్రోన్ సర్వేను ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

గుర్రంకొండ : డ్రోన్ సర్వేతో రైతులకు శాశ్వతంగా భూహక్కు పత్రాలు మంజూరు అవుతాయని తహసీల్దార్ ఖాజాబీ, జెడ్పీటీసీ సమీన్ ముక్తియార్‌లు అన్నారు. శనివారం గుర్రంకొండ మేజర్ పంచాయతీలో డ్రోన్ సర్వేను పుజా కార్యక్రమాలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుర్రంకొండ,చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామాల్లో 9450 ఎకరాలు భూములు ఉన్నాయన్నారు. వీటని12 భాగాలుగా విభజించి డ్రోన్ సర్వే పూర్తి చేస్తామన్నారు. వారం రోజుల్లో డ్రోన్‌సర్వే పూర్తిచేసి ఫీల్డ్‌పై అధికారులు, సిబ్బంది వెళ్లి రైతులను వారి పొలాల వద్దే కలిసి పూర్తి వివరాలు సేకరిస్తారన్నారు. కావున రైతులు డ్రోన్ సర్వేకు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, హౌస్‌ఫెడ్ కార్యదర్శి గయాజ్, వీఆర్వో నాగరాజ, డెప్యూటీ సర్వేయర్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

కలకడ : సామరస్య ధోరణి, పెద్దమనుషుల సమక్షంలో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సీఐ నాగేంద్ర సూచించారు. శనివారం మండలంలోని గుడిబండ పంచాయతీ యల్లంగుడిబండ గ్రామం సమీపంలో పద్మావతమ్మకు చెందిన భూమి అదే గ్రామానికి చెందిన వ్యక్తుల చేతిలో ఉన్నట్లు బాధితురాలు జిల్లా పోలీసు అధికారికి స్పందనలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ శనివారం భూమిని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన రికార్డుల ప్రకారం, ఆ శాఖ అధికారులు నిర్ణయించిన మేరకు హద్దులు ఏర్పాటు చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. దౌర్జన్యాలు, ఘర్షణలకు దిగితే ఇరువైపుల కేసులు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఈఈ

పెద్దతిప్పసముద్రం : మండలంలో జగనన్న పక్కా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ దాస్ ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయనతో పాటు డీఎల్‌డీవో లక్ష్మీపతి, డీఈ శ్రీహరి, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మండలానికి మంజూరైన గృహాలు ఎన్ని, మంజూరై ఇంకా ప్రారంభం కాని గృహాలు, పునాది, గోడల సంఖ్యా వివరాలను సచివాలయాల వారీగా అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఎప్పటికప్పుడు బిల్లులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదే విధంగా లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా ముందస్తుగా ఇచ్చే రూ.35 వేల నగదుకు ఇంకా అదనంగా రూ.15 వేలు మొత్తంగా రూ.50 వేలు మంజూరు చేయాలన్నారు. పునాదులు కూడా చేపట్టని లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు ప్రారంభించేలా చూడాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే అన్నారు.

6 నుంచి వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట

రామసముద్రం : మండలంలోని కుదురుచీమనపల్లె పంచాయతీ మిట్టయంబాడిలో నూతనంగా నిర్మించిన శ్రీరుక్మిణి సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిన్నప్పరెడ్డి తెలిపారు. 6న సాయంత్రం శ్రీగణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్యంగ్రహనం, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, జలాధివాసం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగము జరుగుతుందన్నారు. 7న ఉదయం భగవత్ ప్రార్థన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య స్నపనం, మృత్తికాస్నపనం, కళశారాధనం, అగ్నిప్రతిష్ఠం , మూర్తిహోమం, సకృత్పూర్ణాహుతి, దాన్యాధివాసం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం కళశారాధనం, మూర్తిహోమం, జీవాదతత్వన్యాసహోమం, షోడశన్యాసహోమం, సకృత్‌పూర్ణాహుతి, శయ్యాధివాసం, పుష్పాదివాసం, 8న గణపతిపూజ, పుణ్యాహవాచనం, కళశారాధన, ప్రణాది దశవాయన్యాసహోమం, ప్రాణప్రతిష్ట హోమం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, కళ్యాణోత్సవం, తీర్థప్రసాద వినియోగము జరుగుతుందన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక


వాహిద్


నవీన్‌కుమార్‌రెడ్డి


చరణ్‌తేజ్‌రెడ్డి


కావ్యశ్రీ


పల్లవి

తంబళ్లపల్లె: ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్)కు స్థానిక మోడల్ స్కూల్లో 8వ తరగతి పూర్తి చేసిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ తెలిపారు. పోటీ పరీక్షలో ప్రతిభను చాటి వాహిద్, నవీన్‌కుమార్‌రెడ్డి, చరణ్‌తేజ్‌రెడ్డి, కావ్యశ్రీ, పల్లవిలు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. 9, 10వతరగతి ,ఇంటర్‌మీడియట్ వరకు నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున వారికి స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ త్యాగరాజు, స్కూల్‌కమిటీ చైర్మన్ సలీమ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈనెల 9 నుంచి క్రికెట్ టోర్నమెంట్

రామసముద్రం : రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లి గ్రామంలో ఈనెల 9వ తేదీ నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అలీషా, అఫ్రోజ్‌బాషా , సుధాకర్ , అశోక్, ప్రతాప్ ,రాము, ప్రశాంత్, రమేష్, హరీష్, లక్ష్మణ్‌లు తెలిపారు. గ్రామానికి చెందిన ప్రకాష్, మునిరాజల జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. టోర్నీలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.30,116లు, రెండవ బహుమతి రూ.20,161లు, మూడవ బహుమతి రూ.10,161లు, నాలుగవ బహుమతి రూ.5,161 అందిస్తారారు. టోర్నీలో పాల్గొనే టీములు రూ.999 ఎంట్రీఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 9398194785, 6303208254 నంబర్లను సంప్రదించాలన్నారు.